

ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

సంపుటి : 4 సంచిక : 14 పుష్పం : 18 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 31-12-98, సఖినేటిపల్లి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

రామనామం, కృష్ణనామం, శివనామం ఈనామాలయొక్క మహిమ గురించి వాటి ప్రాముఖ్యత గురించి భాగవతంలో ప్రహ్లాదుడు చెప్పాడు. మీరు రోజూ కాఫీ పానం చేస్తున్నారు, టీ పానం చేస్తున్నారు అలాగే నేను చెప్పే ఈ రెండూ కూడా (1) నామామృతం (2) లీలామృతం పానం చేయండి అని ప్రహ్లాదుడు చెప్పాడు. భగవంతుడి నామంకూడా అమృతంతో సమానము. స్వర్గంలో దేవతలు పానంచేసే అమృతం కూడా ఈ అమృతానికి సరిపోదు. మీరు తరించాలంటే నామామృతం, లీలామృతం ఇవి రెండూ విడిచిపెట్టవద్దు అని చెప్పాడు. భగవంతుడియొక్క గాధలు, భగవంతుని యొక్క మహిమలు శ్రద్ధగా వినటం లీలామృతం. భగవంతుని యొక్క నామాన్ని ప్రీతితో ప్రేమతో స్మరించటం, ఆ రూపాన్ని ధ్యానించటం అది నామామృతం. ఇవి రెండూ పానంచేయండి. వీటివలన ఇంద్రియశుద్ధి కలుగుతుంది. ఇంద్రియశుద్ధి లేకుండా హృదయశుద్ధి రాదు. ఇంద్రియశుద్ధి లేకుండా మనస్సును హృదయంలోనిలుపుదామన్నా అది ఉండదు. ఇంద్రియాలద్వారా బయటకు వచ్చేస్తుంది.

మనస్సులో ఉన్న దోషాలవలన పునర్జన్మలు వస్తాయి. మనస్సులో దోషాలు ఉన్నంతకాలం పునర్జన్మ రాకూడదు అంటే ఆగదు. నీ మనస్సులో ఉన్న దోషం పునర్జన్మను తీసుకొని వస్తుంది. ఏదో కళ్ళు మూసుకొని నాకు ఇంక పునర్జన్మలేదు అనుకోవద్దు. మిమ్మల్ని మీరు వంచన చేసుకోవద్దు. కళ్ళలో వికారం ఉన్నంతకాలం, మనస్సులో దోషం ఉన్నంతకాలం పునర్జన్మ వచ్చి తీరుతుంది. మీకళ్ళలో వికారం పోవాలంటే, మీమనస్సులో ఉన్న దోషాలు పోవాలంటే నామామృతం, లీలామృతం పానం చేయండి. శరీరానికి రోగం వస్తే మందు వాడితే ఆరోగం ఎలా తగ్గుతుందో అలాగ ఈ రెండు అమృతాలను పానం చేయటం వలన నీ మనస్సులో ఉన్న దోషాలు పోతాయి. ఎవరు ఎన్ని మాటలు చెప్పినా, ఎవరు ఏ దేవుని ఆరాధించినా ఇంద్రియాలు ఏ విషయాలను అయితే చింతిస్తున్నాయో, మనస్సు ఏ విషయాన్ని అయితే చింతిస్తోందో వాటిలో నుండి ఇంద్రియాలను, మనస్సును ఉపసంహరిస్తేనేగాని ఆత్మజ్ఞానం కలుగదు. సామాన్యంగా మానవుడు భోగాలను చింతిస్తూ ఉంటాడు. భోగాలను చింతిస్తూ ఉంటే మీరు ఎలా పవిత్రులు అవుతారు. విరోచనాలు అవ్వటానికి ఆముదం పుచ్చుకొంటారు.

రోజూ ఆముదం త్రాగుతూ నాకు విరోచనాలు అవుతున్నాయి అంటే ఎలాగ? భగవంతుని నామాన్ని నిరంతరము స్మరిస్తూ ఉంటే మీరు పవిత్రులు అవుతారు, యోగులు అవుతారు. అనేక జన్మల నుండి మీరు విషయచింతనకు అలవాటు పడ్డారు. అది ఒక గంటలో పొమ్మంటే పోదు. కొంతమంది ఏది మాట్లాడినా లౌక్యంగా మాట్లాడతారు. అదికూడా ఒక వికారము. అది వారికి తెలియదు. అటువంటి వికారాలు ఉన్నంతకాలం ఏ శాస్త్రాలు పారాయణం చేసినా జ్ఞానంరాదు. జన్మజన్మల నుండి మన మనస్సు విషయచింతనకు అలవాటు పడిపోయింది. దానికి విరుగుడు ఏమిటి అంటే ఈ నామామృతం, లీలామృతం. ఇది మీరు శ్రద్ధగా, ప్రేమగా చేయాలి. ఈ కలియుగంలో అందరికి భోగం మీద దృష్టి ఉంటుంది. భోగదృష్టి ఉన్నవారితో సహవాసం చేస్తే మీమనస్సు కూడా భోగం వైపుకు వెళుతుందిగాని యోగం వైపుకు రాదు. యోగం వైపుకు రాకపోతే మనో నిగ్రహం సాధ్యంకాదు. అందుచేత మీరు చేసే స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మరణానంతరజీవితం ఒకటి ఉంది అని మర్చిపోవద్దు. చావుముందు, ముక్తి తరువాత అని మనం అనుకొంటున్నాము. ముందు ముక్తి తరువాత చావు అంటున్నాడు ప్రహ్లాదుడు. మీరు పుణ్యాలు చేసి స్వర్గాలకు వెళ్ళవచ్చు, అక్కడ భోగాలు అనుభవించవచ్చు. భోగాలు అనుభవించాక పుణ్యం ఖర్చు అయిపోతుంది. కాని స్వర్గంలో అనుభవించే భోగాలకంటే ఈ నామామృతం, లీలామృతం వలన నీకు శాంతి కలుగుతుంది, పైగా ఇది ఖర్చు అవ్వదు. పుణ్యం ఖర్చు అవుతుందిగాని ఇది ఖర్చు అవ్వదు. మిమ్మల్ని పవిత్రులను చేసి మీకు ఆత్మ సాక్షాత్కారం కలుగజేసే వరకు మిమ్మల్ని వెంటాడుతుంది. అది దీని అద్భుతం.

దుఃఖం నుండి బయటపడాలంటే మానవుడు ఆత్మవిద్యను ఆశ్రయించాలి. ఒక శిష్యుడు గురువుగారివద్ద ఆత్మవిద్యను నేర్చుకొన్నాడు. ఆత్మసాక్షాత్కారం అయ్యాక గురువుగారితో నేను దుఃఖంలేని స్థితిని పొందాను మీరు బోధించిన విద్యకు బహుమానం ఇవ్వాలి అనుకొంటున్నాను. కాని మీరు నాకు బోధించిన జ్ఞానంతో సమానమైన వస్తువు ప్రపంచంలో ఏదీ కనిపించటంలేదు ఏది ఇవ్వాలో తెలియటంలేదు అన్నాడు. అప్పడు గురువు ఏమి చెప్పాడు అంటే నా ఋణం నీవు తీర్చుకోవాలంటే జన సామాన్యంలో భగవంతుడు ఉన్నాడా, లేడా అనే అవిశ్వాసపరులు ఉంటారు. వారి అవిశ్వాన్ని తొలగించు. వారికి భగవంతుడు ఉన్నాడు అనే విశ్వాసాన్ని కలిగించు. అప్పడు వారికి భగవంతుని పట్ల భక్తి కలుగుతుంది. ఆయన లీలలు వింటారు, ఆయన నామాన్ని స్మరిస్తారు. దుఃఖానికి కారణం అజ్ఞానం. జీవకోటిలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించటానికి ప్రయత్నం చెయ్యి.

మనం నేను నేను అంటాము. మనం చెప్పే నేను నిజమయితే మనకు దుఃఖంరాదు. మన మనస్సే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. దానికి మూలం మనలోపలే ఉంది. మనస్సే

దాని మూలంలో లయమయితే నీవు ఎవరో నీకు తెలుస్తుంది. నిరంతరము లోక వ్యవహారములను చింతించటంవలన మనస్సు చిక్కబడుతుంది, మనోనాశనంకాదు. నిరంతరము లోకవ్యవహారములను చింతిస్తూ ఉంటే వాడు సాధకుడు కాదు. ఆత్మను చింతించేవాడు, దైవాన్ని ధ్యానం చేసేవాడు సాధకుడు. మనస్సు చిక్కపడేపనులు చేయవద్దు. ప్రతీమానవుడు చేసే పొరపాటు ఏమిటి అంటే అహంభావనను పోగొట్టుకోకూడదు, ఈశ్వరుడు తెలియాలి అంటాడు. అహంభావన పోతేగాని ఈశ్వరుడు తెలియబడడు. కొంతమంది మనస్సులో రావణాసురుడులా ఉంటారు. కాని ప్రజలందరూ వాడిని రాముడిగా అనుకోవాలి అనుకొంటాడు. అలాంటిపిచ్చి పనులు వద్దు. నీవు చేసేపని, నీవు మాట్లాడేమాట, నీ ఆలోచన దేహభావన నశించేటట్లు ఉండాలి. గాఢనిద్రలో మనం సుఖంగా ఉన్నాము. ఏ భోగాలను అనుభవించటం వలన, ఏ విషయాలను స్మరించటంవలన మనం గాఢనిద్రలో సుఖంగా ఉన్నామో చెప్పండి. వీటి గొడవ ఏమీ లేకుండా మనం గాఢనిద్రలో సుఖంగా ఉన్నాము. అయితే ఆ సుఖాన్ని గాఢనిద్రలో మనకు తెలియకుండా అనుభవిస్తున్నాము. ఆ సుఖాన్ని ఎరుకతోటి, తెలివితోటి జాగ్రదావస్థలో తెచ్చుకొంటే అదే మోక్షం, అదే నిర్వాణస్థితి. జరుగవలసినది జరిగే తీరును, జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు అనే నిశ్చయం మీకు ఉంటే పరిస్థితులు ఎలా ఉన్నా కూడా మీమనస్సు చల్లగా ఉంటుంది. ఏకారణం వలన మీమనస్సులో అలజడి వచ్చినా భగవంతుడి మీద విశ్వాసం లేదు అని అర్థం. మన గమ్యం పుణ్యం కాదు, జ్ఞానమే మన గమ్యం. పుణ్యం అనుభవిస్తే పోతుంది, జ్ఞానం అనుభవిస్తే పోయేదికాదు. ఈశ్వరుడి మీద ప్రేమ కలగటం అంటే చిన్న విషయం కాదు. ఆయన లీలలు వినాలి, ఆయన గొప్పతనం మీకు తెలియాలి, ఆయన నామంయొక్క విలువ మీకు తెలియాలి.

ఎన్నిశాస్త్రాలు చదివినా, ఎన్ని యాత్రలు తిరిగినా, ఎన్ని నదులలో మునిగినా నీలోపల ఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి రానప్పుడు వాటి వలన ఏమిటి ప్రయోజనం? భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే నీవు లోకంలో ఉన్న వస్తువులకు ఇచ్చే విలువ, ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే వస్తువులకు ఇచ్చేవిలువ పవిత్రతకుగాని, నీహృదయం ఉన్న నిజానికి గాని ఇవ్వటంలేదు. మార్గాన్ని తప్పించకుండా గమ్యానికి తీసుకొని వెళ్ళేవాడే గురువు. ఏదైతే మీరు కాదో దానిలోనుండి మిమ్మల్ని విడుదల చేసి ఏది అయితే మీరో దానితో కలపటమే గురువు చేసేపని. గురువుచేసే పని మీకళ్ళకు కనబడదు. ఆయనచేసే ఉపకారం మీకు తెలియాలి, మీరు చూడాలని అని ఆయన అనుకోడు. ఆయనకు గుర్తింపు అక్కరలేదు ఎందుచేతనంటే ఆయనకు ఇతరులులేరు. నామామృతం, లీలామృతం పానం చేయమని ప్రహ్లాదుడు చెపితే భగవాన్ ఏమంటున్నారు అంటే జ్ఞానం అనే పాయసం మ్రింగమంటున్నారు.

అల్ప విషయాలకు, స్వల్ప విషయాలకు మీకాలాన్ని వృధాచేసుకోవద్దు. ఇతరుల విషయాలలో జోక్యం చేసుకోవద్దు. అలా అయితే కాలం కలిసివస్తుంది, సాధనకు అవకాశం ఉంటుంది. సాధన లేకుండా సిద్ధి కలుగదు. నాలుగురోజులు అన్నం మానివేస్తే ఉపవాసం చేస్తే కామక్రోధాలు తగ్గుతాయి. అలాగని వాటిని జయించాము అనుకోవద్దు. మరల అన్నం తినటం మొదలుపెట్టాక కామక్రోధాలు వచ్చేస్తాయి. మనస్సు అణిగి ఉన్నంతసేపు మనకు ఏమీలేవు అనిపిస్తుంది. మనస్సు లేవగానే అన్నీ వచ్చేస్తాయి. మనస్సును అణిచి ఉంచటం నీలక్ష్యంకాదు. ఎరుకతోటి, తెలివితోటి మనస్సును నాశనం చేయటం నీగమ్యం. నీ మనస్సుకు వ్యాకులత వస్తూ ఉంటే ఏకారణం వలన వస్తోందో చూసుకొని ఆకారణాన్ని తొలగించుకోవాలి. దానిని తొలగించుకొనే వివేకం, విజ్ఞానం నీకు లేకపోతే వివేకం, విజ్ఞానం ఉన్నవారితో, చైతన్యస్థాయి ఎక్కువ ఉన్నవారితో సహవాసం చేసి, వారికి సేవ చేసి వారి ద్వారా జ్ఞానాన్ని సంపాదించుకో.

నిరోధించటం వేరు, తొలగించటంవేరు. నిరోధించినది ఎప్పడైనా విజృంభించే ప్రమాదం ఉంది. తొలగించినది భవిష్యత్‌లో వచ్చే అవకాశం లేదు. నిరోధించినపుడు శాంతిగా ఉంటుంది కాని కారణంలోపల ఉండిపోతుంది అది విజృంభించినప్పడు అశాంతి వచ్చేస్తుంది. నిరోధించటం ముఖ్యం కాదు. తొలగించటం ముఖ్యం. నిరోధించటం వలన ఇంకో ప్రమాదం ఉంది. తరువాత అది ఇంతకంటే ఎక్కువ వేగంగా రావచ్చును. నిరోధించటం తాత్కాలికమే. నీదృష్టి తొలగించటంపైన ఉండాలి. మతం మార్చటంవలన మోక్షం రాదు. హిందూమతం యొక్క విలువ, వేదాలు, ఉపనిషత్‌లయొక్క విలువ, మన ఋషులయొక్క విలువ మనకు తెలియక పోవటంవలన ఇంకో మతంలోనికి వెళితే మోక్షం వస్తుంది అనిపిస్తుంది. అది వెర్రితనం. మోక్షం పొందటానికి కావలసిన సామగ్రి ఇక్కడ ఉండగా ఇంకో మతంలోనికి వెళ్ళవలసిన పని ఏమిటి? జ్ఞానం వస్తుందా, రాదా అని అనుమానం పెట్టుకోవద్దు. మనస్సు అనుమానాలను కల్పిస్తుంది. దాని మాయలో పడవద్దు. మీరు ప్రయత్నం మానకండి. మనస్సు సాధన చేస్తున్నట్లు నటిస్తుంది గాని నిజంగా చేయదు. ఎందుచేతనంటే సాధన చేస్తే అది నశిస్తుంది. దాని నాశనాన్ని అది కోరుకోదు. మనస్సు విషయం అటు ఉంచు. నీ గొడవలో అది కలుగజేసుకోకుండా చూసుకో. అది ఎక్కడయితే ఉదయిస్తోందో అక్కడే ఉండిపో. అక్కడ ఉండిపోతే ఏమౌతుంది అంటే మనస్సుకు ఆహారం అందదు. అప్పడు మనస్సు నెమ్మదిగా కృశించి నశిస్తుంది.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL